# చింత చిగురు

శ్రీ
మంచళ్ల సుదర్శనాచార్యులు

★

చైత్ర లక్ష్మి రావటంతోటే వనలక్ష్మి శోభించి నవపుష్పవతి అయింది. మన్మథాగమన భ్రాంతి కలిగి కోకిల కూజితాలతో ప్రతిధ్వనించింది. చెట్లు చిగిర్చినాయి. మనోహరంగా దినమణి కాంతికి బంగారు మయమై పోయింది వనమంతా. పూమరందాన్ని కుత్తుకబంటిగా త్రాగి, మత్తెక్కి, అరగక, ఝుంకారాలు సల్పుతున్నవి తేటిదంపతులు. వాటి ఆగడానికి వెఱచి అల్లల్లాడుతున్నవి పుష్పగుచ్ఛాలు. రాత్రంతా స్వప్రియ విరహానికి తపించి వాడిపోయిన పద్మినీ కాంతలు ప్రియుని దర్శనం కావడంతోటే, వికసించి తమిదీర ఆకర్షించుకొంటున్నవి సూర్యభగవానుని కిరణసారమును, శుద్ధస్ఫటిక జలాశయములలోని మీనసంతతిలోన చెర్లాటలాడుకొను నప్పుడు వీటి శరీరభాగము తళతళలాడిపోతున్నవి సూర్యరశ్మికతన. కవి కుమారులకు నేత్రానంద దాయకమై, మనోహర భావ సందోహ కారణాస్పదమై అప్పట్టున వోలక్ష్మి చైత్రలక్ష్ముల చెలిమిబలిమి ఆనందమొన గూర్చుచుండెను. అంతయు మనోహరమే. అంతయు నూత్నమే. అంతయు రామణీయకమే.

పగలు పది గంటలు కొట్టారు. కొద్దికొద్దిగా స్వీయప్రభావాన్ని రుచి చూపించుతున్నాడు భాస్కరుడు విజృంభించి. ప్రతివారు తమ పనులను నెరవేర్చుకుంటున్నారు. బిచ్చగాండ్రు ప్రతివాకిట నిలిచి భిక్షాటన చేస్తున్నారు. చింతలు చిగిర్చినందున బాలబాలికలు తమ పోషణార్థమై చెట్టుచివరి కొనదాక ఎక్కి అందినంతవరకు చిగురును కోసుకుంటున్నారు. వారిలో వారికే సరససల్లాపాలు. ఇంటి ముచ్చటలు. తామెంత చిగురు కోయకలిగినది దాన్ని అమ్మితే ఎన్నినూకలు వచ్చేది మాట్లాడుకొంటున్నారు. చేతనైన చురుకుగలవాళ్లు పెద్ద వడికట్టుకొని దాన్ని ఓరుగుతో నింపుతున్నారు. పట్టకపోతే క్రిందికిదిగి తమ వెంట వచ్చిన వారిదగ్గరదాచి మళ్ల ఎగబ్రాకుతున్నారు. లేగ గనుక పాలను త్రాగునప్పుడు కదలక మెదలక నిల్చియుండే గోమాతవలె భూజసంతతి కదలకుండ పిల్లల బరువును మోయుచున్నవి.

ఈవిధంగా చిగురు కోయుటకు వచ్చినవారు చాలవఱకు ఏనాది పిల్లలు. అందులో ఒకపిల్ల పదునాల్గేండ్ల వయస్సుగలది. ఆమెలో యౌవన దశవచ్చింది. మిసమిసలాడుతుంది దేహము. నల్లటి దేహమైనప్పటికి, బీదరికంతో నల్లటి చింకిరి గుడ్డలు కట్టుకొన్నప్పటికి, ఆమె సౌందర్యము మాత్రము కొఱతవడలేదు. అందరిలోకల్ల యీడులో అనుభవంలో, తెలివితేటలలో పెద్దది గనుక, యీ పిల్ల పెద్ద వడికట్టుకొని దాన్ని, నింపటానికై అన్ని కొమ్మలు ఉడుతవలె ఎగిరి దాటుతుంది. చాలవరకు నిండటానికి వచ్చింది. తానారోజున కొద్దిగా ఆలస్యంగావచ్చింది తోడి పిల్లలు తమ వడినిండగానే చెట్లుదిగి వెళ్లిపోయారు. వారితో పాటు వెళ్ళటానికి యింకా వడి నిండలేదు. అందుకని యింకా చెట్టుమీదనే ఉండిపోయింది. త్వరత్వరగా కోసుకొంటం ప్రారంభించింది.

ప్రతిరోజు తోటయజమాని వచ్చి మామిడి పిందెలను తెంపుకొనిపోకుండా పాకలో కూర్చుండేవాడు. కాని అతనికి గుంటూరులో కోర్టు వాయిదా ఉన్నందున ఆవేళ రాలేదు. అందుకని బదులుగా మేనల్లుడు వచ్చాడు. ప్రతిరోజు యీవిధంగా సుబ్బులు వచ్చి కోసుకుంటుందని ఎఱుగడు. దాన్నిచూచే టప్పటికి యితనిలో దుర్బుద్ధిపుట్టింది. ప్రతిరోజూ తానే వచ్చేలాగు చేసుకుందామని ఆలోచించాడు. పిల్ల ఆకారాన్ని చూస్తే బాగానేఉంది. కాని చింకిరి గుడ్డలు కట్టింది. ఎవరో బీదదనుకొన్నాడు. ఒక నిముషంసేపు తన దుస్తులవంకా, తన హోదావంకా, తన స్థితిగతులవంకా చూచుకొన్నాడు. ముసల్మానయి నప్పటకి,

పోట్లాడాగలవాడు కనుక, అడిగితే 'సరే' అంటుంది అనుకొని దురూహా పడ్డాడు. అంతేకాని మానపోషణకు, బీదరికానికి హస్తిమశకాంతరం వ్యత్యాస ముంటుందని తెలుసుకోలేకపోయాడు విచక్షణా విచక్షణ జ్ఞానం, పశుత్వ ప్రేరేపిత యౌవన మదోద్రేకంలో నశించిపోతుంది. అది సహజమే ప్రతివానికి. కాని ఆ ఘడియ తప్పించుకుంటే ధన్యుడే. శీలభంగ కారకుడుకాడు. తరువాత వానికే తన తప్పిదము గోచరిస్తుంది. అంతదాక ఓపికలేనివాడే పశువు లాగ ప్రవర్తిస్తాడు. తాను గవయ దలచిన పడతికూడ అతనికి తోడైతే అగ్నిలో ఆజ్యంవదలినట్లే దుర్మార్గానికి. వేరేవిధంగా పరిణమించిందో కుడిచేతిలోబడ్డ బల్లిమాదిరి గిజగిజ లాడుతాడు.

ఇంద్రియ నిగ్రహంలేక యౌవన మదంలోఉన్న మన ముసల్మాను భాయి తప్పుడు త్రోవ త్రొక్కాడు. అతనికి సుబ్బుల్ని వశపఱచు కుందామనే వెర్రి ఆలోచన పుర్రెలోపుట్టింది. వలపు విషయములో సాధారణంగా ప్రతితుచ్ఛుడు మొండి పట్టుదల పడతాడు. చెవుల లోనుంచి వేడి బయలుదేరింది. శరీరమంతా ఒక్కసారి ప్రణయ మంత్రాన్ని స్పందించింది. ప్రేమ పిపాస హెచ్చింది. సృష్టి అంతా తారుమారుగా కన్పించింది. ఇట్టి అవస్థలో అంధప్రాయుడై తన పాక లోనుంచి మెల్లగా చెట్టువద్దకు వెళ్ళినాడు. చుట్టూ ఎవరులేరు కాని ఎదురుగా ఆవలఉన్న రోడ్డుమీద రహదారి బండ్లు మాత్రము నడుచు చున్నవి. చుట్టు ప్రక్కల మనుష్యుల అలికిడి లేనందున మఱింత పొంగి పోయాడు.

సుబ్బుల కీ గొడవ యేంతెలుసు! ప్రతిరోజు తోడిపిల్లలతో ఖులాసాగా ఆడుకుంటూ పాడుకుంటూండేది. యి వ్వాళ ఒంటరిగా నుంటంబట్టి కిక్కురు మనకుండా చిగురను కోసుకుంటుంది. క్రింద ఏం జరిగేది, యింకో నిముషానికి జరుగబోయే దేమిటో ఎలా నిర్ణయించు కొంటుంది? మామూలుగా చిగురు కోసుకొని యింటికి వెళ్ళిపోదామనే ఉబలాటం. చెట్టుకున్న చిగురంతా అయిపోయి నందున, ఉన్నా ఏచివరి కొమ్మనో వుండినందున, దానిని దిగి తన వడినింపు కొందామని మరొక చెట్టుమీదికి వెళ్లుదామని అనుకొని క్రిందికి దిగుతుంది. దిగుతూనే చూచింది కొద్ది దూరంలో మన యువకుణ్ని. తోట యజమాని అయి ఉంటాడని, మామిడి పిందెల జాగ్రత్తకై అటుయిటు తిరుగుతు న్నాడని తలవంచుకొన్నది. దిగంగానే రహీం (యువకునిపేరు) సమీపించాడు. ఏమో యెరుక ఉన్నవాని లాగా,

"వడి నిండిందా! చిగురు కోయడం పూర్తి అయిందా?"

సుబ్బులు:-లేదు దొర! ఈచెట్టుకు చిగు రయిపోయింది; వేరేదాని మీదికి వెళ్తున్నా-

ర:- అట్లాగా! నువ్వు చాల సేపటి నుంచి కోస్తూనే వున్నావుగా! యింకా పూర్తికాలే-

సు:-పూర్తి కాలేదు కనుకనే యింకొకదాన్ని ఎక్కుదా మనుకుంటున్నా.

ర:-పాపం! చాల సేపటినుంచి చూస్తున్నా- ఇంకా పూర్తికాలేదా? ఈ చిగురంతా ఎంతకు అమ్ముకుంటావు?

సు:-ఏదో పెట్టినమ్మ మరిన్ని నూకలు పెట్టుతుంది, లేనమ్మలేదు. అదృష్టంబట్టి దొరుకుతాయి మాకు గింజలు.

ర:-ఎంత సేపట్లో అమ్మగలవు?

సు:-ఇంత సేపని నిర్ధారణ ఉందా? ఎవరికి కావాలిస్తే వారు తీసుకుంటారు. చిగురయిపోయిం దాకా మాత్రం తిరుగుతా.

ర:-ప్రతిరోజు సాధారణంగా ఎన్నింటికి వెడతావు అమ్ముకొని.

సు:-అదికూడ ఖచ్చితంగా చెప్పలేను. ఒకనాడు పది అవుతుంది,

పదకొండవుతుంది, పన్నెండవుతుంది. దానికి లెక్కేమిటీ?

ర:-ఇవ్వాళ యిప్పటికే పదికొట్టి చాలా సేపయింది కదా ఎప్పుడు అమ్మి వెడతావు మరి?

సు:-ఎంతైనా గానండి- అమ్మి మాత్రం వెడతా.

ర:-అమ్మేటప్పటికి చాల ఆలస్యం అయితే అన్నానికి యిబ్బంది పడవూ?

సు:-ఏం చెయ్యాలె దొరా! పొట్టకు లేకపోతే- ఎంతసేపైనా సరే!

ర:-(తనలో) నన్ను దొరా! అని పిలుస్తుంది. అడిగిన దానికల్లా జవాబు చెప్తుతుంది. నవ్వుతూ కూడాఉంది. తప్పకుండా నా మాట వింటుంది. (ప్రకాశంగా) చాల అలసినట్లున్నావే- కాసేపు కూర్చొని కోసుకుందుగానీలే-

సు:-ఇప్పుడే పదికొట్టి చాలసేపయింది. కూర్చోటానికి టయిముంటుందా! అయినా కష్టం చేసుకొని బ్రతికేవాళ్ళకు మాకు అలసట ఎక్కడుంటుంది?

ర:-ఎంత కష్టం చేసుకునేవాళ్లకైనా కాస్త విశ్రాంతి తీసుకుంటే మంచిది కాదూ? రా- చల్లగా ఆ పాకాలో కూర్చుందువు గానీ! మళ్ళ వెళ్లావచ్చు.

సు:-దండం స్వామీ! బీదదాన్ని, దొరవారు కూర్చునే పాకలో కూర్చుంటానికి తాహతుంటుందా?

ర:-ఏమీ పరవాలేదులే రా; నేను రమ్మంటున్నాగా, నామాటవిను.

సు:-వద్దు దొరా! నేను చిగురు కోసుకోవాలి.

ర:-నామాట వినవా? చిగురు కోసుకోవచ్చులే తరువాత- ఎందుకు పిల్చానో ఆలోచించుకో.

సు:-అమ్మో! ఏమైనా అనండి- నేను రాను. నాకు ప్రొద్దుపోతుంది.

ర:-ఎందుకంత జంకుతావు. పిలుస్తుంటే రానంటావేం. చిగురు కోయనిచ్చి నందుకా?

సు:-అయ్యా! ఇవ్వాళనే కాదు, మేము పెద్దదొర పుణ్యమా అంటూ చాల రోజులనుంచి, యీ కాలంవస్తేసరి, చిగురు కోసుకొని బ్రతుకుతాం.

ర:-నిజమే! దీన్ని అమ్ముకొని బ్రతుకుతారనే మేము కోసుకోనియ్యాటం- కాని, పిలుస్తే కాసేపు కూర్చుంటం తప్పా?

సు:-మేము చిగురు కోసుకోటానికే గాని, దొరల పాకలో కూర్చొనటానికి కాదు గానివ్వడం బాబూ.

ర:-నేను రమ్మన్నాగా- రా.

సు:-పెద్దదొర ఆజ్ఞలేంది రాను.

ర:-అరే! పెద్దదొరకు బదులు నేను వచ్చానుగా! రమ్మంటున్నాను. అంతగా పాకలో కెందుకొచ్చావని అడుగుతే చెప్తాలే నేనే రమ్మన్నానని.

సు:-ఇప్పటికే చాల వేళయింది యీ మాటల్లో. ఇంకా నా వడినిండటానికెంతలేదన్నా అరగంట కావాలి. అప్పటికి పదకొండున్నర దాటుతుంది. దాన్ని అమ్ముకొనే సమయము దొఱుకదు. వదలి పెట్టండి. మీ పుణ్యమా అంటూ నేను వెళ్లుతా.

(వెళ్లుతూంటుంది)

సుబ్బులు చేసే మొండితనానికి రహీం విసిగాడు. ఎంత ప్రేమగా పిల్చినను రాలేదే అని విస్మయపడ్డాడు. కాని దాని హృదయము నిష్కల్మష మనియు, అమాయక మనియు గుర్తించ లేకపోయినాడు. పశుప్రాయుడై వెనకగుండా వెళ్లి గట్టిగా చెయ్యిబట్టుకొని.

"పిలుస్తుంటే రాకపోతా వెందుకు? ఇంతమొండి దానవా?

సు:-నన్ను వదలిపెట్టండి. చిగురు కొసుకోటానికి వెళ్లుతున్నా నేను కోసుకోకపోతే నా బదులు మీరు కోస్తారా- అట్లా లాగుతారేం? వదలండి.

ర:-నా మాట విను- అక్కడి దాక వెళ్లి కాసేపు కూర్చొన్న తరువాత పంపిస్తా.

సు:-ఎక్కడి దాకంటే?

ర:-పాక దాక.

సు:-నేను రాను- వదలిపెట్టు. చెబితే వినకపోతే పెద్దగా అరుస్తూ పెద్ద దొర దగ్గరికి వెడతా.

ర:-ఏం చేసానని అరుస్తావు?

సు:-ఇంకా చేసేదేముంది? చెయ్యి బట్టుకొని బలవంతాన లాక్కుపోతూ.

ర:-ఇదిగో? చూడు చిగురు అమ్ముకోకుండానే నీకు డబ్బువచ్చే ఉపాయం చూపిస్తా.

సు:-ఏంటది?

ర:-ఆఁ! అట్లా అడుగు. ఒక్కసారి నిన్ను ముద్దుపెట్టుకోనీ?

సు:-పెట్టుకో నిస్తే.

ర:-ఒక రూపాయి యిస్తా. నీ యిష్టం వచ్చినట్లుగా వాడుకో.

సు:-బాబో! రూపాయా! నాకెందుకు మా వాళ్ళు చూచారంటే నీకెక్కడినుంచి వచ్చిందే అని చిదుక బాదుస్తారు. మీకు, మీ రూపాయికి వేయి నమస్కారాలు. నన్ను వదలిపెట్టండి

ర:-మెల్లగా చెప్పితే వినడంలే- బలవంతాన ముద్దుపెట్టుకుంటా!

సు:-ఏంటీ! పరాయి పిల్లమీద అంత అధికారమా! పెట్టి పోషిస్తున్నావనా?

ర:-ఏమైనా అనుకోయిక.

అంటూ చేతిలో రూపాయిపట్టుకొని భుజంమీద చేయివేసాడు. భయంతో వణకుతూ యిక తనను వదలి పెట్టడనుకొని,

సు:-దొరా! ఎవరైనా చూస్తే ఏమన్నా అనుకుంటారు. ఇప్పుడే వాకిట్లోకివెళ్ళి నాల్గువైపులూ చూస్తా తరువాత, ఏం!

ర:-ఎవరు రారులే-పదకొండయింది. ఆ తలుపు దగ్గరకు నెట్టు.

సు:-మొదట చూచివచ్చి తరువాత నెట్టుతాలే.

ర:-సరే! వెంటనే రా.

'అట్లాగే' అంటూ యివతలికి వచ్చినట్టు వచ్చి సుబ్బులు బ్రతుకు జీవుడా అంటూ చాటుచాటుగా రోడ్డువైపు పరుగెత్తుతూంది బెదరిపోయిన లేడిలాగా వెనక్కిచూస్తూ. ఇవతలికి వచ్చిచూచాడు. తప్పించుకొని పారిపోతూందని రోషపడి వెంటాడాడు. ముందు కొద్ది దూరంలో సుబ్బులూ, వెనుకరహీం. ఇంతలో రోడ్డు కెక్కింది సుబ్బులు. ఎదురుగా వస్తూన్నారు గంపలు నెత్తిన బెట్టుకొని కూరగాయ లమ్ముకొనేవాళ్లు. వాళ్ళనుచూచి 'నన్ను రక్షించండి. ఆ వెనుకవచ్చే ఆయన నన్ను బలవంత పెడుతూన్నాడు' అంటూ ఏడుస్తుంది. తన గుట్టు బైట పెడుతుందని వెనుకనుంచే పెద్దగా "పట్టుకోండి. దాన్నివదలి పెట్టవద్దు చిగురు కోసుకుంటానికి తోటలోకివచ్చి దొంగతనం చేసింది. నేనుచూచి లోపలికి వచ్చేటప్పటికి, యీ విధంగా అబద్ధములాడుతూ పరుగెత్తుతూంది" అంటూ అరిచాడు. వచ్చేవాళ్ళకు ఏమీతోచక, ఏది నేరమో, ఏది నిజమో తెలియక మాట్లాడకుండా తమ దారిని బడ్డారు.

పాపం! మళ్ళీ సుబ్బులు వంటరి అయిపోయింది. అయినా ప్రాణానికైనా తెగించి పరుగెత్తుతూనే ఉంది. అబల- అందులో పసిది. ఇదివరకే తోటలో హడలెత్తి పోయింది. పరుగెత్తుటవలన ఆయాసము, అలసట కలిగినవి. పైటజారుతూ వేళ్లాడుతున్నా పరుగులెత్తుతూంది. రహీం ఎదిగిన ఆంబోతులాగా వెనుక ముందు ఆలోచించకుండ వెంటబడ్డాడు. నాల్గు అడుగుల్లో సమీపించి సుబ్బుల్ని పట్టుకొన్నాడు. ఇక మెల్లగా చెబితే లాభంలేదని, రెండు చేతులతో నెత్తుకొని అరుస్తున్నా లెక్కచేయకుండా తోటవైపు పరుగెత్తుతున్నాడు సుబ్బుల్ని తీసికొని. శక్తిలోపంలేకుండా పెనగులాడుతూ, అరుస్తూంది సుబ్బులు. కాని రహీం పట్టినపట్టు యమపట్టు. వదలిపెట్ట లేదు.

ఎట్లాగైతేనేం తోటలోపడ్డాడు. పాక తలుపు వేసాడు. అరిచి, అరిచి, పాపం! స్పృహలేకుండా పడిపోయింది సుబ్బులు. అంగీకరించిందని సంతోషించి, అమానుష కృత్యానికి దిగాడు రహీం-

* * *

పన్నెండయింది. కాని సుబ్బులు యింకా రాలేదని తండ్రి వెంకడు బజారికి వెళ్ళిచూచాడు. ఎక్కడా కనబడలేదు. ఏమి జరిగిందా యింత ఆలస్యమగుటకని భయపడుతూ తోటవైపు వెళ్లాడు.

సుబ్బులకు స్పృహ వచ్చింది. పాకాలో తానొక్కతేఉంది కాని రహీం లేడు. లేచి కూర్చొంది. మళ్లీ భయం ఆవేశించింది. వళ్ళంతా నలగ బొడిచినట్లు తోచింది. లేచి నిల్చొని చీరె సవరించుకుంటూంది. రక్తమయమైనవి గుడ్డలు. దాన్ని చూడంగానే గుండెల్లో గుండెలు లేవు. ఏడుస్తూ తన తండ్రికి చెప్పుదామని బయలుదేరింది.

వాకిట్లోకి రాంగానే తండ్రి కనబడ్డాడు. సుబ్బులికి మరింత దుఃఖం పొంగిపోయింది. ఆపుకోలేక తండ్రిని కౌగలించుకొని ఏడటం మొదలు పెట్టింది. ఒక్కతే ఆడపిల్ల అని చాల ప్రాణసమానంగా పెంచుకొంటూన్న వెంకడికి గుండెలవిసినవి. కండ్లు చెమర్చినాయి. శరీరమంతా జలదరించింది. కూతుర్ని బుజగించుతాజరిగినసంగతి అడిగాడు. పూస గ్రుచ్చినట్లంతా తండ్రికి చెప్పింది బాష్ప సలిలధారావ్యవధానములలో నేత్రాలు జాలిగొల్పుతూండంగా.

ఏమనుకొన్నాడో తల ఊపి కూతురిని వెంటబెట్టుకొని మెల్లగా తీసికొని వెళ్లాడు.

* * *

ఆ దేపోత. మళ్లా తోటవైపు రాలేదు రహీం. అతని దుర్మార్గమును వెంకడు తోట యజమానితో చెప్పక గంభీరించి ఊరుకున్నాడు. కాని తగిన శాస్తి చెయ్యాలని మాత్రము నిశ్చయించుకున్నాడు. తన బాల్య స్నేహితుడగు రాముని చెవిలో మాత్రం వేసాడు మనోభిప్రాయాన్ని. సమయానికి ఎదురు చూస్తూన్నారు.

తిరిగి మరొక రోజున మేనమామ గుంటూరు వెళ్ళుతూ, తోటకు వెళ్లమని చెప్పాడు రహీంకు వెళ్లడానికి యిష్టంలేక పోయినా, తన పొకాదాకు లోపం లేకుండా, సుబ్బులు వెళ్ళినా దాని తల్లిదండ్రులేమి చేస్తారులే అని నిర్భయంగా బయలుదేరాడు తోటకు.

పగలంతా గడపాడు హాయిగానే- మళ్ల సుబ్బులు వస్తుందేమో అని చూచాడు. కాని సుబ్బులే కాదు, తక్కిన పిల్లలు కూడ చిగురు కోసుకోటానికి రాలేదు. ఇంకా వస్తుంది, యింకా వస్తుందని యెదురుచూస్తూనే గడిపాడు. చీకటిపడింది. ఇక తోట కాపరులు వస్తారులే అని బయలుదేరాడు యింటికి.

పాకకు, రోడ్డు వైపు వచ్చే త్రోవకు మధ్య మామిడితోపు దట్టంగా ఉంది. దాని కావలి వైపే పాక ఉంది. తోపు దగ్గరకు రాగానే సుబ్బులూ, వెంకడూ, రాముడు "దండం! దొరా! పొద్దు పోయిందాకా ఉన్నారేం" అంటూ వినయంగా అడిగారు. సుబ్బుల్ని చూచేటప్పటికి మొదట గుండెలు కొట్టుకున్నా, వారు యీవిధంగా అడిగేటప్పటికి తన దుర్మార్గము తెలియలేదని మురిసిపడ్డాడు.

ఉన్నట్టుండి, పిడుగు పడ్డట్టుగా సుబ్బులాతని ఎదురుగానే తండ్రికి క్రిందటిసారి జరిగిన కథ అంతా, యిదివరకు తెలియజేయని దానివలె చెప్పింది. దాంతో అసలా పనికే వచ్చారు కనుక యింకాస్త వళ్ళు మండి కర్రలెత్తారు వెంకడు రాముడు.

'ఏమిరా! కర్రలెత్తుతారూ! అంత పొగరా" అంటూ ఉరిమాడు రహీం.

"లేదురా! దొర! దుర్మార్గుణ్ణి ఊరికే పోనిస్తే మరీ ప్రబ్బలిల్లుతాడు. తగిన శాస్తి చెయ్యాలి కదూ? కుక్క కాటుకు చెప్పుదెబ్బ. యింకముందీవిధంగా ఎక్కడా చేయకుండా బుద్ధి చెప్తాము" అంటూ చావగొట్టారు రహీంను. వళ్లంతా కాయలు కాచింది. పైమొగము పగిలిపోయింది. వళ్లు తెలియకుండా పడ్డాడు ఆ పల్లేరు చెట్ల మీదనే.

'మదపిచ్చికిదేమందు' అంటూ వెళ్లారు అక్కడినుంచి సుబ్బులు, రాముడు, వెంకడు.

——